
నంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడపవద్దు

చేవెళ్ల, జూన్ 29 : నంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. శనివారం సాయంత్రం మండల పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ పోలీస్‌లు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్‌ప్లేట్‌లు లేని వాహనాలను సీజ్ చేశారు. సీఐ మాట్లాడుతూ చేవెళ్ల డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ప్రతీరోజు తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని ఆయన సూచించారు.

కార్మికుల ప్రాణం దైవాధీనం!

పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు

కార్మికులంటే పరిశ్రమల యాజమాన్యాలకు లెక్కే లేకుండా పోయింది. తరచూ ప్రమాదాలు జరిగి అనేకమంది ప్రాణాలు గాలిలో కలుస్తున్నా వాటి నివారణ చర్యలు చేపట్టడం లేదు. కొన్నిసార్లు కార్మికుల మృతదేహాలను గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. పరిశ్రమల్లో కనీస రక్షణ చర్యలు చేపట్టకున్నా అధికారులు వాటి గురించి పట్టించుకోవడం లేదు. అసలు అధికారులు పరిశ్రమల వైపు కన్నెత్తి చూడడమే మానేశారు. దీంతో పరిశ్రమల యాజమాన్యాలది ఆడింది ఆట.. పాడింది పాటగా తయారైంది. వీరందరి నిర్లక్ష్యానికి కార్మికులు బలవుతున్నారు.



ప్రమాదానికి గురైన సౌత్ గ్లాస్ పరిశ్రమ

వందల మంది కార్మికుల మృతి

ఒక్క షాద్‌నగర్ నియోజకవర్గంలోనే పదేళ్లలో అధికార లెక్కల ప్రకారం వందలాది మంది కార్మికులు మృతి చెందారు. చిన్న చిన్న సంఘటనలో మృతి చెందిన వారిని యాజమాన్యాలు గుట్టుచప్పుడు కాకుండా వారి స్వగ్రామాలకు తరలించిన సంఘటనలూ ఉన్నాయి. 2014లో కొత్తూరు పారిశ్రామికవాడలో జరిగిన ప్రమాదంలో సుమారు 60 మంది కార్మికులు మరణించారు. అలాగే ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామం వద్ద ఉన్న స్టీమ్‌కోర్ పరిశ్రమలో ఒకేసారి 10మంది కార్మికులు దుర్మరణం చెందారు. 2022లో బూర్గుల గ్రామ పరిధిలోని కలర్ పరిశ్రమలో ఏడుగురు కార్మికులు చనిపోయినట్లు సమాచారం. ఇలా పరిశ్రమలో ప్రమాదాలు జరుగుతున్నా అధికారగణం మాత్రం యాజమాన్యాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

దినదిన గండంగా..

పరిశ్రమల్లోని కార్మికుల బతుకులు దినదిన గండంగా మారుతున్నాయి. అత్యంత ప్రమాదకరమైన పరికరాల వద్ద పనిచేస్తున్న కార్మికులకు పరిశ్రమల యాజమాన్యాలు రక్షణ పరికరాలు అందజేయడం లేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అన్న ఆందోళనతో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రధానంగా స్పాంజ్ ఐరన్ పరిశ్రమలో అత్యంత వేడితో తయారు చేసే ఇనుము కోసం ఉపయోగించే బ్లాస్టెడ్ ఫర్నెస్, ఫర్నెస్ లాంటి పరికరాల వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ప్రతీ సంవత్సరం పదుల సంఖ్యలో కార్మికులు మృతి చెందడం, 10 నుంచి 20 మంది వరకు గాయాల పాలవ్వడం జరుగుతుంది. అలాగే ఫార్మా పరిశ్రమలో మందుల తయారీకి ఉపయోగించే రియాక్టర్ పరికరాలు పేలి కూడా పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం జరుగుతుంది. అందులో ఉండే మంటలు కార్మికుల చర్మంపై పడి తీవ్ర గాయాల పాలవుతున్నారు. గ్లాస్ పరిశ్రమలో అద్దాల తయారీ కోసం ఆటోక్లేవ్ పరికరాన్ని ఉపయోగిస్తారు. ఇందులో గ్యాస్‌తో పాటు గాలి నిండి ఉంటుంది. అద్దాలు తయారు చేసేటప్పుడు గ్యాస్, ఎయిర్‌తో కలిపి కేవలం 13 కిలోల బరువు మాత్రమే ఉండాలి. అందుకోసం ప్రతి 10 నిమిషాలకు ఒకసారి దానిని పరిశీలిస్తూ 13 కేజీలకు మించకుండా ఆపరేటర్ జాగ్రత్త తీసుకోవాలి. శుక్రవారం జరిగిన సౌత్ గ్లాస్ పరిశ్రమలో ఆటోక్లేవ్ పరికరం 30 కేజీల వరకు చేరుకోవడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలిసింది.



పేలిన రియాక్టర్

- కానరాని రక్షణ పరికరాలు
- అందుబాటులో లేని అంబులెన్సులు
- శ్రద్ధ చూపని యాజమాన్యాలు
- మృత్యువాత పడుతున్న కార్మికులు
- చోద్యం చూస్తున్న అధికారులు
- 10 ఏళ్లలో వందమందికి పైగా మృతి
- గుట్టుచప్పుడు కాకుండా శవాల తరలింపు

షాద్‌నగర్/షాద్‌నగర్ రూరల్, జూన్ 29: కార్మికులకు చట్టాలు ఉంటాయి.. కానీ అవి కనుచూపు మేరలో కూడా కనిపించవు.. తనిఖీలకు అధికారులు ఉంటారు.. కానీ నెల నెలా తనఖా తీసుకుని కుర్చీలో నిద్రపోతుంటారు.. చట్టాలన్నీ యాజమాన్యాలకు చుట్టాలుగా మారడంతో పరిశ్రమలో జరిగే ఘోర ప్రమాదాలు కార్మికుల జీవితాను కాలగర్భంలో కలిపేస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా బూర్గుల శివారు చింతగూడ గ్రామ పరిధిలోని సౌత్ గ్లాస్ పరిశ్రమలో చోటు చేసుకున్న సంఘటన మరోసారి ఈ విషయాన్ని స్పష్టం చేసింది. పరాయి రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు ఒక్క పేలుడు ఘటనతో చితికిపోయి చితికి చేరారు.

హృదయాలను కలిచివేసిన ప్రమాదం

క్షణ కాలంలో జరిగిన ప్రమాదంలో మాసంపు ముద్దలా మారిన శరీరాలు.. ఎవరి శరీర భాగాలు ఏవో అర్థం కాకుండా ఎక్కడపడితే అక్కడ పడిపోయిన కాళ్లు, చేతులు, మొండెం భాగాలు.. తమ కళ్లముందే కన్నుమూసిన కార్మికులను చూస్తూ మిన్నంటిన సహ కార్మికుల హాహాకారాలు..ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని పరుగులు తీసిన ఘటనలు.. శుక్రవారం రాత్రి సౌత్ గ్లాస్ పరిశ్రమలో కనిపించిన దృశ్యాలివి. ఇలాంటి ప్రమాదకర పనిముట్ల దగ్గర పని చేస్తున్న కార్మికులకు భద్రత, రక్షణ పరికరాలు అందించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉంది. కానీ వీళ్లు కార్మికుల గోడు పట్టించుకోవడం లేదు. కార్మికుల ప్రాణాలంటే వీరికి లెక్క లేదు. దీనిని తనిఖీ అప్రమత్తత కార్మిక శాఖ అధికారులు సైతం వారి గోడు పట్టించుకోలేదు. ఫలితంగా జరిగిన దారుణం కార్మికులను విగత జీవులుగా మార్చింది.



పేలుడు ధాటికి అక్కడికక్కడే మృతి చెందిన కార్మికుడు

త్రుటిలో తప్పిన భారీ అగ్ని ప్రమాదం

ఆటోక్లేవ్ యంత్రాన్ని పరిశ్రమలో పూర్తిగా కిందిస్థాయిలో బిగించారు. పేలుళ్లు కూడా కింది స్థాయిలోనే జరిగాయి. అదే గనుక కొంచెం ఎత్తులో ఉంటే అక్కడే ఉన్న విద్యుత్ పరికరాలకు తగిలి భారీ అగ్ని ప్రమాదం సంభవించడంతో పాటు, పరిశ్రమ కూడా పూర్తిగా దగ్ధమయ్యే పరిస్థితి ఉండేదని పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. పేలుళ్ల ధాటికి పరిశ్రమలో ఉన్న గ్లాస్ కూడా నేలమట్టమయిందని తెలిపారు.

అనుభవం లేని వారితో పనులు

పరిశ్రమల్లో అన్‌స్కిల్డ్ కార్మికులతో యంత్రాల వద్ద పని చేయిస్తుండటంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. స్కిల్డ్ కార్మికులకు అధిక వేతనాలు చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే యాజమాన్యాలు అనుభవం లేని కార్మికులతో పని చేయిస్తున్నారు. దీంతో పాటు ప్రతి కార్మికుడి భద్రత కల్పించాల్సిన యాజమాన్యం ఈ విషయంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతోనే పరిశ్రమల్లో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. కార్మికుల సంక్షేమం పట్ల లేబర్ శాఖ అధికారులు కూడా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

జిల్లాలో 3,474 పరిశ్రమలు

రంగారెడ్డి జిల్లాలో భారీ, మధ్య తరహా పరిశ్రమలు 3,474 వరకు ఉన్నాయి. ఇందులో మైక్రో 2,182, చిన్న తరహా పరిశ్రమలు 1,094, మధ్యతరహా పరిశ్రమలు 62, భారీ పరిశ్రమలు 103, మెగా పరిశ్రమలు 9, మెగా ఇన్‌ఫ్రా 24 వరకు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా బిహార్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 37వేల మంది కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో కూడా సుమారు 300 పరిశ్రమలు ఉండగా ఇక్కడ కూడా వలస కార్మికులే అధికంగా ఉన్నారు. వలస కార్మిక సంక్షేమం, కనీస వేతనం, పని గంటల కోసం కేంద్రం అంతరాష్ట్ర వలస కార్మిక చట్టం 1979ను ప్రవేశపెట్టింది. ఈ చట్టం ప్రకారం వలస కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు, లేబర్ శాఖలో పేరు నమోదు లాంటి వాటిని అమలు చేయాల్సి ఉన్నా ఎక్కడా ఈ చట్టం అమలు కావడం లేదు.

వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి



మా రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉండవు. అందుకోసమే ఇక్కడికి వలస వచ్చి ఉద్యోగాలు చేస్తున్నాం. కానీ ఇలా జరుగుతుందని ఊహించలేదు. మా రాష్ట్రానికి చెందిన చిత్తరంజన్, రాంప్రకాష్, రఘుకాంత్ మరణించడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వారి తల్లి తండ్రులను పోషించుకోవడం కోసమే పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నారు. ఇలా జరగడంతో వారి కుటుంబం గడవడం కూడా కష్టంగా మారుతుంది.

- లాల్ మోహన్, కార్మికుడు, సౌత్ గ్లాస్ కంపెనీ

విధిలేక ఉద్యోగం చేస్తున్నాం



మా కుటుంబాలను పోషించుకోవడానికే ఇక్కడ పనిచేస్తున్నాం. పని భారం ఎక్కువగా ఉన్నా నెలకు జీతం మాత్రం రూ. 13 వేలు మాత్రమే ఇస్తున్నారు. వేతనాలు పెంచమని కోరితే ఉద్యోగం నుంచి తొలిగిస్తారన్న భయంతో అడగడం లేదు. ఉద్యోగాల్లోంచి తొలగిస్తే కుటుంబం గడవడం కూడా కష్టమవుతుందన్న ఉద్దేశంతోనే ఉద్యోగం చేస్తున్నాం.

-మంతోష్‌కుమార్, కార్మికుడు, సౌత్ గ్లాస్ కంపెనీ

ఎయిర్‌పోర్టులో విదేశీ కరెన్సీ పట్టివేత



శంషాబాద్ రూరల్, జూన్ 29: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అక్రమంగా తరలిస్తున్న విదేశీ కరెన్సీని డీఆర్ఐ అధికారులు శనివారం పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. ఓ ప్రయాణికుడు ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్ వెళ్లేందుకు వచ్చాడు. డీఆర్ఐ అధికారులు అతడిని తనిఖీ చేయగా రూ.67.11లక్షలు విలువైన యూఎస్ డాలర్లు లభించగా స్వాధీనం చేసుకున్నారు. కాగా, అతడు కరెన్సీని ట్రాలీ బ్యాగ్ లోపలి అరలో దాచిపెట్టాడు. ఆ డబ్బుకు ఎలాంటి పత్రాలు లేకపోవడంతో అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా ముందస్తు సమాచారంతోనే డీఆర్ఐ అధికారులు ఎయిర్‌పోర్టులో మాటు వేసి పట్టుకున్నట్లు తెలుస్తోంది.

యాచారంలో భారీ వర్షం

యాచారం, జూన్ 29 : యాచారం మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సాయంత్రం గంటన్నర పాటు యాచారం, చౌదర్‌పల్లి, నందివనపర్తి, గున్‌గల్, చిన్నతూండ్ల, మేడిపల్లి, తక్కళ్లపల్లి, మల్కీజ్‌గూడ, కొత్తపల్లి, చింతపట్ల, మొండిగౌరెల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఈ వర్షం కారణంగా వాడిపోతున్న పత్తి, జొన్న పంటలకు చాలా మేలుకలిగిందని రైతులు తెలిపారు.



యాచారంలో కురుస్తున్న వర్షం

ధరణి దరఖాస్తులకు త్వరిత పరిష్కారం

- ధరణి మాడ్యూల్స్ కింద దాఖలైన 3,779 దరఖాస్తులు పరిష్కరించాం
- పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి క్లియర్ చేస్తాం
- కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జూన్ 29 : పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. రాష్ట్ర భూపరిపాలన విభాగం ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ శశాంక మాట్లాడారు. ధరణి మాడ్యూల్స్ కింద దాఖలైన 3,779 దరఖాస్తులను పరిష్కరించినట్లు చెప్పారు. మిగిలిన దరఖాస్తులను త్వరలో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి ఏ ఒక్క దరఖాస్తూ పెండింగ్ లేకుండా పరిష్కరిస్తామని తెలిపారు. ఎక్కువగా జిల్లాలోని చేవెళ్ల, మొయినాబాద్, యాచారం, కందుకూరు, మంచాల, మహేశ్వరం మండలాల్లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఆర్డీవో, తహసీల్దార్ లాగిన్లలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను వెంట వెంటనే పరిశీలిస్తూ క్లియర్ చేస్తానని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ శశాంకతో పాటు జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

కలెక్టరేట్‌లో గణాంక దినోత్సవం

ప్రొఫెసర్ చంద్ర మహలనోబిస్ జయంతి సందర్భంగా జాతీయ గణాంక దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ శశాంక హాజరై చంద్ర మహలనోబిస్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా గణాంక దర్శిని 2022-23 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ గణాంక దినోత్సవ విశిష్టతను, ప్రాముఖ్యతను వివరించారు. పుస్తక ప్రచురణ సమగ్రంగా సంకలనం చేసే విషయంలో అంకితభావంతో పనిచేసిన జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమానికి అర్థగణాంక శాఖ తరఫున ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ వైఆర్‌బీ శర్మ (రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్) గణాంకశాఖ గురించి వివరణాత్మకంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీవో సౌమ్య, జిల్లా అధికారులు, గణాంకశాఖ అధికారులు పాల్గొన్నారు.

మీరేమంటారు?

రైతు భరోసా అమలుపై సర్కారు అభిప్రాయ సేకరణ



- ప్రాథమిక సహకార సంఘాల సమావేశాలు ఏర్పాటు
- వచ్చేనెల 4వ తేదీ వరకు కార్యవర్గ సమావేశాలు
- రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించాలని ఆదేశం
- సాగుచేయని భూములు, ఎకరాల పరిమితిపైనే ఫోకస్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, జూన్ 29)

జూలై నెలలో రైతుభరోసా పథకం అమలు చేయాలని భావిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చురుకుగా చేస్తోంది. గతంలో మాదిరిగా కాకుండా కేవలం వ్యవసాయం చేస్తున్న రైతులకు మాత్రమే పంటసాయం అందించాలని భావిస్తున్న ప్రభుత్వం ఈ మేర చర్యలు మొదలు పెట్టింది. ఎన్నికల సమయంలో రైతులకు పంట సాయం ఎకరాకు రూ. 15వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇస్తామని ప్రకటించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎకరాకు పంట సాయం రూ.10వేల చొప్పున ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మొత్తాన్ని రూ.15వేలకు పెంచుతామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. అలాగే రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ ఇస్తామని ప్రకటించింది. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన ఈ రెండు హామీలపై దృష్టి పెట్టింది. ఆగస్టు 15వ తేదీలోగా రుణమాఫీ చేస్తామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. అలాగే రైతుబంధు స్థానంలో రైతుభరోసా అమలు చేసేందుకు సర్కార్ కసరత్తు మొదలు పెట్టింది. అయితే వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే రైతుభరోసా అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. అంతేకాక రైతుభరోసా పథకం ఎలా ఉండాలి? ఎవరికి ప్రయోజనం దక్కాలి? ఎమైనా పరిమితి పెట్టాలా? ఆదాయపన్ను కట్టే వారి విషయంలో ఏం చేయాలి? కౌలురైతుల విషయంలో ఏంచేయాలి? అనేదానిపై శనివారం నుంచి క్షేత్రస్థాయిలో అభిప్రాయాలను సేకరిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు వేదికల్లో పాల్గొన్న రైతుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

నాలుగు లోగా పూర్తి చేయాలి

తాజాగా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది రైతుభరోసా పథకంపై క్షేత్రస్థాయిలో రైతుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ప్రాథమిక సహకార సంఘాల సమావేశాలు నిర్వహించాలని వ్యవసాయాధికారులను ప్రభుత్వం ఆదేశించింది. వచ్చేనెల 4వ తేదీ వరకు అన్ని ప్రాథమిక సంఘాల సర్వసభ్య సమావేశాలు నిర్వహించి రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి పంపాలని సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉంటే ఇటీవల రైతు వేదికల ద్వారా నిర్వహించిన సమావేశాల్లో రైతులు వ్యవసాయం చేసే రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలని , ఆదాయపన్నుతో సంబంధం లేకుండా దీన్ని కొనసాగించాలని కోరారు. అలాగే రియల్ ఎస్టేట్ వెంచర్లు, వ్యవసాయేతర అవసరాలకు వినియోగించే భూములకు సాయం ఇవ్వకూడదని సూచించారు. రైతుభరోసాకు వ్యవసాయ పరిమితిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పదెకరాల వరకు మాత్రమే సాయం అందించాలని ఎక్కువ మంది అభిప్రాయపడగా ఎకరాలతో సంబంధం లేకుండా సాగుచేసే భూములన్నింటికీ సాయం అందించాలని కొందరు కోరారు.

భారీగా తగ్గనున్న లబ్ధిదారులు

ఇదిలా ఉంటే గతంలో జిల్లా వ్యాప్తంగా 4,04,436 మంది రైతులను రైతుబంధు కింద లబ్ధిదారులుగా గుర్తించారు. అయితే ఇందులో 3,17,914 మంది రైతులు మాత్రమే ఆధార్ అనుసంధానం చేసుకున్నారు. వీరికి మాత్రమే సాయం అందచేశారు. ప్రభుత్వం తాజాగా తీసుకుని నిర్ణయంతో రైతుభరోసా లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయి. రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో ఇటీవల కాలంలో వేలాది ఎకరాల భూములు వ్యవసాయేతర భూములుగా మారాయి. పట్టణీకరణ నేపథ్యంలో హైదరాబాద్ శివార్లలోని వేలాది ఎకరాల్లో వెంచర్లు, ఇతర నిర్మాణాలు వచ్చేశాయి. దీంతో సాగు భూమి తగ్గిపోయిది. కానీ గత ప్రభుత్వం కొత్త పాస్‌బుక్‌లు ఉన్నవారందరికీ రైతు బంధు కింద సాయం అందచేసింది. వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలు ఉన్న ప్రాంతాలకు కూడా రైతుబంధు ఇవ్వడం గమనార్హం. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించడంతో లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గనుంది.

హామీల అమలుకు కృషి

- జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి
- కందుకూరులో రూ.77లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం

కందుకూరు, జూన్ 29: ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసేందుకు కృషి చేస్తోందని జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తెలిపారు. మండలంలోని లేమూరు, కందుకూరు, పులిమామిడి, ధన్నారం గ్రామాల్లో రూ.77లక్షల 79వేల జడ్పీ నిధులతో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఆమె మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో రంగారెడ్డి జిల్లాలోని అన్ని మండలాల అభివృద్ధికి రాజకీయాలకతీతంగా నిధులు మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అంచలంచెలుగా నెరవేర్చుతున్నారని చెప్పారు. మండల కేంద్రంలోని ప్రధాన సమస్య అయినటువంటి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తిస్థాయిలో నెరవేర్చడానికి రూ.33లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. కందుకూరు, లేమూరు, ధన్నారం, పులిమామిడి గ్రామాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల పనుల నిమిత్తం మంజూరు చేసిన నిధులతో పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా, లేమూరు, మండల కేంద్రంలో తనను అవమానించారని ఎంపీపీ మంద జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లా చేపట్టడం విడ్డూరంగా ఉందని, లేమూరులో స్థానిక నేతలు తనను స్టేజీ పైకి పిలిచి అవమానించారన్నారు. అనితారెడ్డి కల్పించుకొని ఎంపీపీని సముదాయించారు. జడ్పీటీసీ జంగారెడ్డి, వైస్‌ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పీసీసీ సభ్యులు జంగారెడ్డి, మల్లేష్, ఎంపీటీసీ రాజమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, ఎండీవో సరిత, ప్యాక్స్ డైరెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, నాయకులు తదితరులున్నారు.



శంకుస్థాపన చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి


సదస్సులో మాట్లాడుతున్న బీఎన్ రావు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 29: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఆయిల్ పామ్ తోటలను సాగుచేసే రైతులు ఆర్థికాభివృద్ధిని సాధిస్తారని తెలంగాణ రాష్ట్ర ఆయిల్‌పామ్ సలహాదారుడు డాక్టర్ బీఎన్ రావు అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని మధురాపురం గ్రామంలో శనివారం ఉద్యాన-పట్టు పరిశ్రమ శాఖ, వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ తోటల సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సుకు డాక్టర్ బీఎన్ రావు హాజరై రైతులనుద్దేశించి మాట్లాడారు. దేశంలో మంచినూనె కొరతను నివారిస్తూ.. రైతులకు ఆర్థిక పరిపుష్టి కల్గించాలన్న ఆలోచనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ తోటల సాగును ప్రోత్సహిస్తున్నదని అన్నారు. రంగారెడ్డి జిల్లాలోని నేలలు కూడా ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయని, 365 రోజులు సాగునీరు ఉన్న ప్రతీ రైతు ఆయిల్ పామ్ మొక్కలను నాటుకోవచ్చని తెలిపారు. ప్రతి ఎకరంలో చతురస్రాకారంలో నాటితే 50, త్రిభుజాకారంలో నాటితే 57 మొక్కలను నాటుకోవచ్చని తెలిపారు. నాటిన మూడు సంవత్సరాల తరువాత పంట ప్రారంభమై 30 ఏళ్ల వరకు ఆదాయాన్ని ఇస్తుందని, పంట చేతికొచ్చే వరకు అంతరపంటగా కూరగాయలను సాగుచేసుకోవచ్చని సూచించారు. రంగారెడ్డి జిల్లాలో ఆయిల్ పామ్ మొక్కలను నాటించి, సంరక్షణతో పాటు పంటను కొనుగోలు చేసే బాధ్యతను వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రభుత్వం అప్పగించిందన్నారు. మొక్కనాటింది మొదలు పంట చేతికొచ్చే వరకు వాల్యూ ఆయిల్ కంపెనీ పర్యవేక్షణ చేస్తుందన్నారు. మొక్కనాటి మూడు సంవత్సరాల సంరక్షణ వరకు ప్రతి ఎకరానికి 65వేల రూపాయల వరకు ఖర్చు వస్తే, ప్రభుత్వం 52వేల రూపాయల సబ్సిడీని ఇస్తుందని, రూ.193 ధర ఉన్న మొక్కను రూ.20లకు ఇస్తారని తెలిపారు. ప్రతీ రైతు 12.20 ఎకరాల్లో సాగు చేసుకోవడానికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీపై, ఐదు ఎకరాల కంటే ఎక్కువున్న రైతులకు 80 శాతం సబ్సిడీపై డ్రిప్పును కూడా ఇస్తుందని తెలిపారు. మూడేళ్ల నుంచి వచ్చే పంటను కొనుగోలు చేసి.. 14 రోజుల్లో డబ్బులు ఇచ్చే బాధ్యత కూడా వాల్యూ అయిల్ కంపెనీదేనని తెలిపారు. 13 నుంచి 14వేలు టన్ను ధర ఉన్న పామ్ అయిల్ పంట.. ఎకరాకు 8 నుంచి 12 టన్నులు వస్తుందని తెలిపారు. ఖర్చులు పోను ప్రతి యేటా ఎకరంపై రూ.లక్ష ఆదాయం పొందవచ్చని తెలిపారు. వాల్యూ అయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామోహన్‌రావు మాట్లాడుతూ మనదేశం ప్రతీయేటా దిగుమతి చేసుకుంటున్న 150 లక్షల టన్నుల నూనెను స్వదేశంలోనే ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. దేశ వ్యాప్తంగా 75 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా నేటి వరకు 3లక్షల ఎకరాల్లోనే సాగుచేశారని, ఆయిల్ పామ్ సాగులో రైతులకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. షాద్‌నగర్ ఉద్యానశాఖ అధికారి ఉషారాణి, మధురాపురం మాజీ సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు భార్గవ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాకు ఆ ప్రధానోపాధ్యాయుడే కావాలి

● పాఠశాల హెచ్‌ఎంను బదిలీ చేయొద్దని డీఈవోకు వినతిపత్రం ఇచ్చిన మేడిపల్లికలాన్ వాసులు


వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

పూడూరు, జూన్ 29 : ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల్లో తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖాజా మైనుద్దీన్‌ను బదిలీ చేయొద్దని కోరుతూ మేడిపల్లికలాన్ గ్రామస్తులు డీఈవో రేణుకాదేవికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని మేడిపల్లికలాన్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోనాధ్యాయుడు ఖాజామైనుద్దీన్ ఉపాధ్యా బదిలీల్లో భాగంగా ట్రాన్స్‌ఫర్ అవుతున్నారు. విషయం తెలుసుకున్న కొందరు గ్రామస్తులు, యువకులు శనివారం డీఈవోను కలిసి ఖాజా మైనుద్దీన్‌ను బదిలీ చేయొద్దని, ఒకవేళ బదిలీ చేసినా డిప్యుటేషన్‌పై తిరిగి మా గ్రామ పాఠశాలకే పంపాలని కలెక్టర్ ప్రతిక్‌జైన్, డీఈవోను కోరారు. మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్లు రవికుమార్, తుప్పరి రమేష్, మాజీ వైస్ చైర్మన్ ఉస్మాన్, పత్తి మల్లేశం, శశిధర్, షేర్‌ఖాన్, స్టమక్ రవి, రామకృష్ణారెడ్డి, తుప్పరి వెంకటేష్, శ్రీకాంత్, భూపాల్, అన్వర్, మోసిన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆ డాక్టర్ అందరికీ ఆదర్శం

● 158 సార్లు రక్తదానం చేసిన సంపత్ కుమార్


రక్తదానం చేస్తున్న డాక్టర్ సంపత్ కుమార్

తాండూరు, జూన్ 29: పది, ఇరవై సార్లు కాదు.. తాండూరు పట్టణానికి చెందిన ఓ డాక్టర్ సాబ్ ఇప్పటివరకు 158సార్లు రక్తదానం చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. తాజాగా శనివారం డెలివరీకి సిద్ధంగా ఉన్న మహిళకు రక్తదానం చేశారు. తాండూరు పట్టణ శివారులోని ఎంసీహెచ్ (మాతా శిశు) ఆస్పత్రిలో కొడంగల్ ప్రాంతం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన మద్దూర్ మహేష్ భార్య హర్షితకు రక్తం అవసరమైంది. ఆమె అన్న రాజు ఆ విషయాన్ని డాక్టర్ సంపత్‌కుమార్‌కు తెలిపారు. దీంతో ఆయన స్వయంగా ఆస్పత్రికి వచ్చి రక్త ఇచ్చారు. హర్షిత కుటుంబ సభ్యులు ఆ వైద్యుడికి కృతజ్ఞతలు తెలిపారు.

దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రపై సినిమా


చెక్కు అందజేస్తున్న స్థానికులు

వికారాబాద్, జూన్ 29 : తెలంగాణ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం అమరుడైన దొడ్డి కొమురయ్య జీవిత చరిత్ర ఆధారంగా సినిమా నిర్మిస్తున్నామని, ఆయన పోరాట ప్రతిభను ప్రపంచానికి తెలిసేలా దొడ్డి కొమురయ్య పేరిట సినిమా తీయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఫిలిం డైరెక్టర్ సేనాపతి తెలిపారు. శనివారం శ్రీ వివేకవాణి విద్యాలయంలో సినిమా నిర్మాణ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం సినిమాలో నటించేందుకు గాను నటీనటులను, డ్యాన్సర్లను, గాయకులను ఎంపిక చేసే ప్రక్రియ చేపట్టారు. దర్శకుడు సేనాపతి మాట్లాడుతూ ప్రతీ జిల్లా నుంచి 30 మంది సహ నిర్మాతలకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణ వికారాబాద్ జిల్లా కమిటీ సహ నిర్మాతల కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ జిల్లా అధ్యక్షుడు జైదుపల్లి గోపాల్, భాస్కర్, వివేకావాణి విద్యాలయం కరెస్పాండెంట్ నాగయ్య, ప్యాట నర్సిములు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నటీనటులను ఎంపిక చేశారు. చిత్ర నిర్మాణ కోసం తమ వంతు సహాయంగా స్థానికులు దర్శకుడికి చెక్కును అందజేశారు.

'రైతు భరోసా'పై అభిప్రాయ సేకరణ

● రైతులతో సమావేశమైన అధికారులు

వికారాబాద్/పెద్దేముల్/కీసర, జూన్ 29 : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి పెట్టుబడి సాయం ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ తెలిపారు. శనివారం వికారాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని కొత్తగడి పీఏసీఎస్‌లో అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. రైతుల నుంచి రైతు భరోసాకు సంబంధించి అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రుణమాఫీ కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగడి పీఏసీఎస్‌లో సెక్రటరీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రైతులు రుణాల కోసం వెళితే.. పాతవి కట్టే వరకు కొత్తవి ఇచ్చేది లేదని చెబుతున్నారని, ఆయన్ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దాంతో అధికారులు రైతులకు నచ్చజెప్పడంతో శాంతించారు. 10 ఎకరాల వరకు ఉన్న రైతులకు రైతు భరోసా ఇవ్వాలని, గ్రామాల్లో వెంచర్లు చేసిన వాటికి, ఎకరాలకు ఎకరాలు కొనుగోలు చేసి పడావుగా(ఖాళీగా) ఉన్న భూములకు రైతు భరోసా సాయం అందివ్వద్దని రైతులు సూచించారు. సొసైటీ చైర్మన్ సుభాన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నర్సిములు, ఏవో జ్యోతి, సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ విక్రమ్, సీఈవో ఖాదర్, ఏఈవో అనిల్ తదితరులున్నారు. పది ఎకరాల లోపు భూమి ఉన్నవారికి మాత్రమే రైతుభరోసా అందించాలని పెద్దేముల్ మండలంలోని రైతులు అభిప్రాయాలు వెల్లడించారు. పెద్దేముల్, తట్టిపల్లి సొసైటీలలో రైతు భరోసా సాయంపై రైతుల నుంచి సూచనలు, సలహాలు కోరుతూ అభిప్రాయ సేకరణ చేపట్టారు. కాగా, పది ఎకరాల లోపు సాగు ఎంత చేస్తే అన్ని ఎకరాలకు మాత్రమే రైతు భరోసా అందించాలని సూచించారు. కోట్లు ఖర్చుపెట్టి ఎమ్మెల్యేలు, ఎంపీలుగా చలామణి అవుతున్న వారికి సాయం ఇవ్వాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. పారిశ్రామికవేత్తలు, ఫాంహౌజ్‌లు కట్టుకున్న వారికి, రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు ఇవ్వరాదని తెలిపారు. డీసీవో ఈశ్వరయ్య, సొసైటీ చైర్మన్లు లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఆర్ చంద్రయ్య, ఏడీఏ రుద్రమూర్తి, ఏవో నజీరుద్దీన్, ఎఫ్‌ఎస్‌సీఎస్ మేనేజర్ మురళిగౌడ్ పాల్గొన్నారు. రైతుభరోసాను సాగుచేసే భూములకే వర్తింపజేయాలని పలువురు రైతుల అభిప్రాయాలు తెలిపారు. కీసర సహకార సంఘం చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన రైతు భరోసా పథకంపై మహాజన సమావేశం నిర్వహించారు. డీసీవో రాజేందర్ పాల్గొని మాట్లాడుతూ 15వ తేదీ వరకు రైతు భరోసాపై అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. వ్యవసాయం చేసే రైతులకే రైతు భరోసా అందించాలని, కౌలు రైతులకు, వ్యవసాయం చేయని భూములకు రైతు భరోసా ఇవ్వకూడదని మెజార్టీ రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు. సహకార సంఘం వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, డైరెక్టర్లు రైతుల పాల్గొన్నారు.

అధికారులు సమయస్ఫూర్తితో పని చేయాలి



ఎంపీడీవో దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు, జూన్, 29: అధికారులు సమయస్ఫూర్తితో పనిచేస్తూ ప్రజలకు సేవలందించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం కొందుర్గులోని జీఎం పటేల్ ఫంక్షన్ హాల్‌లో ఎంపీడీవో డాక్టర్ ఆంజనేయులు పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పూలమాల, శాలువాతో ఎంపీడీవో దంపతులను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. అధికారులు తమ ఉద్యోగ కాలంలో చేసిన సేవలతో గుర్తింపు వస్తుందని, పంచాయతీ రాజ్ విభాగం అంటేనే రోజూ పంచాయితీలుంటాయని, అలాంటి శాఖలో ఎంపీడీవోగా అంజనేయులు మంచి పేరు తెచ్చుకోవడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. ఆయన ఎంతో కష్టపడి, ఉద్యోగం సంపాదించి, ఈ స్థాయికి ఎదగడం స్ఫూర్తిమంతం అన్నారు. అంతకు ముందు ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య, ఎంపీడీవో దంపతులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈవో రంగారావు, జడ్పీ వైస్‌చైర్మన్ ఇ.గణేష్, ఎంపీపీ జంగయ్య, వైస్ ఎంపీపీ రాజేష్, ప్యాక్స్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ ఇస్తారమ్మ, వివిధ పార్టీల నాయకులు కృష్ణారెడ్డి, యాదయ్య, శ్రీధర్‌రెడ్డి, సాదిక్, జహంగీర్, రమేష్‌రెడ్డి, మాణయ్య, మల్లేష్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, గోపాల్, రామకృష్ణ, లింగమయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. పర్వతాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఎస్సీ, బీసీ కమ్యూనిటీ హాళ్లకు శంకుస్థాపన చేశారు. కల్వర్టు పనులను ప్రారంభించారు. పైప్‌లైన్, సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. వెనుకబడ్డ మండలంపై ప్రత్యేక దృష్టిపెట్టామని పర్వతాపూర్‌లో 30లక్షలతో పనులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎంపీటీసీ మంజులమల్లేష్ గౌడ్, కృష్ణారెడ్డి, మంగులాల్‌నాయక్, రాధాకృష్ణ, రవి, చంద్రశేఖర్, నర్సింలు, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

షాద్‌నగర్ రూరల్: అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములైతేనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం చింతగూడ-కారెడ్డిగూడ గ్రామాల మధ్య గతంలో వర్షాలకు తెగిన కల్వర్టు నిర్మాణానికి రూ.40లక్షలతో చేపట్టకున్న పనులకు భూమిపూజ చేశారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. రవాణా సౌకర్యం బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు ఆనంద్, ఎంపీటీసీ లక్ష్మి, ఆగమయ్య, యాదగిరి, విష్ణు, కల్పన, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇర్విన్‌ను మండల కేంద్రంగా చేయాలి

మాడ్గుల, జూన్ 29: మండలంలోని ఇర్విన్‌ను మండలంగా ఏర్పాటు చేయాలని ఇర్విన్ పంచాయతీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు శనివారం వినతిపత్రం అందచేశారు. మాడ్గులకు ఇర్విన్ 10కిలో మీటర్లు దూరం ఉందని, ఈ గ్రామానికి మండలానికి కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయని బీజేపీ నాయకులు అన్నారు. ఇర్విన్, చంద్రాన్‌పల్లి, కలకొండ, గిరికొత్తపల్లి, రామ్‌దుగ్యాల, కోలుబాయితండా, జర్పులతండా, నర్సాయపల్లి, కూబ్యాతండా, అందుగుల, అంతమ్‌పేట గ్రామాలను చేర్చి కొత్త మండలంగా చేయాలని బీజేపీ నాయకులు అన్నారు. రాష్ట ప్రభుత్వం ఈ మేరకు వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఘనంగా జాతీయ కెమెరా దినోత్సవం



కేక్ కట్‌చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

కడ్తాల్, జూన్ 29: జాతీయ కెమెరా దినోత్సవాన్ని కడ్తాలలో శనివారం జరుపుకున్నారు. ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ మధుర స్మృతులను పదిలంగా ఉంచేది, చరిత్రను సజీవంగా నిలిపేది ఒక్క ఫొటోగ్రఫీ మాత్రమేనన్నారు. ఫొటోగ్రఫీ వృత్తిపై ఆధార పడ్డవారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీశైలం, ఉపాధ్యక్షులు రబ్బాని, కార్యదర్శి కిరణ్, నాయకులు శివ, మహేశ్, నదీమ్, శ్రీకాంత్,శేఖర్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు సీపీఐ నేతల వినతి

శంషాబాద్, జూన్ 29 : శంషాబాద్‌లోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద గల లేబర్ అడ్డా వద్ద రూ.5కు భోజన క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని శనివారం సీపీఐ నాయకులు గిరి, ప్రభు, యాదగిరి వినతిపత్రం ఇచ్చారు. క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తే కార్మికులకు ఉపయోగం ఉంటుందన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు

కేశంపేట, జూన్ 29: వానాకాలం సీజన్‌కు అవసరమైన పచ్చిరొట్ట ఎరువులైన జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాధికారి శిరీష శనివారం తెలిపారు. వీటి సాగు వల్ల భూసారం పెరుగుతుందన్నారు. 40 కిలోల బస్తా రూ.1,450 తెలిపారు. విత్తనాలు కావలిసిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ ధ్రువపత్రాలతో కేశంపేట, వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కందుకూరులో సాయిచంద్ వర్ధంతి



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

కందుకూరు, జూన్ 29: ఉద్యమకారుడు, గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ మాజీ చైర్మన్ సాయిచంద్ మొదటి వర్ధంతిని శనివారం కందుకూరులో అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కంద నర్సింహ ఆధ్వర్యంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై సాయిచంద్ చిత్రపటానికి మాజీ ఎంపీటీసీ సరళజంగయ్య పూలమాల వేశారు. సాయిచంచ్ తన పాటలతో అంచలంచలుగా ఎదిగి సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాడని గుర్తు చేశారు.

'లక్ష్మారెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు'

మాడ్గుల, జూన్ 29:మండలంలోని అప్పారెడ్డిపల్లికి చెందిన గౌరవరం లక్ష్మారెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఏఐసీసీ కార్యదర్శి వంశీచందరెడ్డి లక్ష్మారెడ్డి మృతదేహానికి నివాళి అర్పించారు. లక్ష్మారెడ్డి మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయనతో పార్టీ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

కేజీబీవీ భవనాన్ని ప్రారంభించాలని ఏబీవీపీ నిరసన



నిరసన దీక్షలో పాల్గొన్న ఏబీవీపీ నాయకులు

కడ్తాల్, జూన్ 29:కడ్తాలలో నిర్మాణం పూర్తైన కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం నిరసనదీక్ష చేపట్టారు. హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై చేపట్టిన దీక్షలో ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులకు పూలమాలలు వేసి నిరసన దీక్షను బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్, మాజీ వార్డు సభ్యుడు దోనాదుల మహేశ్ ప్రారంభించారు. హాజరైన ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. కడ్తాలలో ఇంకా పాఠశాల తరగతులను ప్రారంభించ లేదన్నారు. నిర్మించిన భవనాన్ని ప్రారంభించకుండా విద్యార్థిలను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి భవనం ప్రారంభంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు స్వార్థ రాజకీయాల కోసం విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేయడం సరి కాదన్నారు. భవనాన్ని వెంటనే ప్రారంభించి తరగతులు నిర్వహించాలని కోరారు. ఏబీవీపీ నాయకులు మురళి, భరత్, మల్లేశ్, పవన్, మధు, శివ, ప్రవీణ్, మల్లేశ్, సుమన్, అనిల్, భద్రు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేశాం



ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల, జూన్ 29 : ఐదేళ్లు చేవెళ్ల మండలాన్ని అందరి సహకరంతో అభివృద్ధి చేశామని ఎంపీపీ మల్గారి విజయలక్ష్మిరమణారెడ్డి అన్నారు. శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. సమస్యలపై ఎంపీటీసీ సభ్యులు వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషిచేశామన్నారు. ఐదేళ్లలో రూ.3.6కోట్లతో పనులు చేశామన్నారు. మరో సారి ప్రజలు అవకాశమిస్తే మరింత సేవ చేస్తామన్నారు. ప్రజలకు తాగునీరు, విద్యుత్ సమస్యలు రాకుండా అధికారులు కృషిచేయాలన్నారు. చివరి సమావేశం కావడంతోఎంపీటీసీలను ఎంపీపీ సత్కరించారు. వైఎస్ ఎంపీపీ శివప్రసాద్, ఎంపీడీవో హిమబిందు, ఎంపీవో విఠలేశ్వర్, డీటీ రాజేంద్ర, ఏవో తులసి పాల్గొన్నారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు నివేదికిస్తామని ఎంపీపీ చెప్పారు.

'ధరణి' పరిష్కారానికి సత్వర చర్యలు



ఎమ్మెల్యే నారాయణ రెడ్డిని సన్మానిస్తున్న లక్‌పతి, మోత్యానాయక్

కడ్తాల్, జూన్ 29: ధరణి పోర్టల్‌లో భూ సమస్యలను పరిష్కరిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. కడ్తాల మండలం పోచమ్మగడ్డ, గాన్గుమర్ల తండాల రైతులు శనివారం ఎమ్మెల్యే నారాయణరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు లక్‌పతినాయక్, మోత్యనాయక్‌లతో కలిసి తండాలకు నిధులు కేటాయించాలని, భూ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. తండాలో నిషేధిత జాబితాలో చేర్చిన భూములను తొలిగించాని అభ్యర్థించారు. సమస్యలపై రెవెన్యూ అధికారులతో మాట్లాడుతానని కసిరెడ్డి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇబ్బందులుండవని చెప్పారు. ఆగస్టు 15కల్లా రైతులకు రూ.2లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పారు. త్వరలోనే రైతుల ఖాతాల్లో రైతుభరోసా డబ్బులు జమచేస్తామన్నారు. భాస్కర్, టీక్‌లాల్, హర్య, పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో బీజేపీ ఓబీసీ మోర్చా కమిటీ

రంగారెడ్డి అర్బన్, జూన్ 29: రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా పూర్తి కమిటీని నియమించామని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దుద్దాల లక్ష్మీనారాయణ తెలిపారు. జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా పసునూరి బిక్షపతిచారి, డి.వెంకటయ్యయాదవ్, ఎ.సత్యయ్య, కె.విష్ణుమూర్తి, శ్రీనివాసచారి, ఆర్.జంగయ్యగౌడ్, ఎం.మాణయ్య, వి.వేణుగౌడ్, కె.నర్సింహాగౌడ్, ఎన్.కుమార్‌లను నియమించారు. ప్రధాన కార్యదర్శులు ఎ.శ్రీనివాస్‌గౌడ్, టి.అంజయ్యచ కార్యదర్శులు ఎ.వెంకటేష్‌గౌడ్, ఎన్.వందన, డి.ప్రభాకర్‌గౌడ్, డి.కుమార్, ఎ.రాజు, కొండల్ ముదిరాజ్, ఎ.భాస్కర్‌గౌడ్, సీహెచ్.రవియాదవ్, కె.క్రిష్ణగౌడ్, ఎస్.శ్రీనివాస్‌లను నియమించారు. కోశాధికారిగా కె.నర్సింహ, అసెంబ్లీ కన్వీనర్లుగా బి.శివకుమార్, చంద్రమౌళిని నియమించారు. స్పోక్స్ పర్సన్‌గా శేఖర్‌సింగ్, శ్రీశైలంయాదవ్, వెంకటేష్, శివరాజ్, నరేష్‌యాదవ్, వెంకటచారి, శ్రీనివాస్, రాజు, మీడియా కన్వీనర్‌గా శ్రీనివాస్‌యాదవ్, మరో 18మంది సభ్యులను ఆయన నియమించినట్లు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేలతో ఉప్పల సమావేశం



సమావేశమైన నాయకులు

ఆమనగల్లు, జూన్29: మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాల్‌రాజ్, రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డిలతో శనివారం తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో వారితో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడం లేదని, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టే పోరాట కార్యక్రమాలపై చర్చించినట్లు వెంకటేశ్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, పలువురు నాయకులు ఉన్నారు.

టీఎస్ఐఐసీ భూముల్లో సాయిల్ టెస్ట్

● యంత్రాల బిగింపు.. అడ్డుకున్న రైతులు

యాచారం, జూన్ 29 : కుర్మిద్దలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో మట్టి పరీక్షల(సాయిల్ టెస్ట్)కు యత్నించిన టీఎస్ఐఐసీ అధికారులను రైతులు అడ్డుకోవడంతో వెనుదిరిగారు. టీఎస్ఐఐసీ అధికారులు శనివారం ఫార్మాసిటీ భూముల్లో బండరాళ్లున్నాయి? నేల స్వభావంపై పరీక్షలు చేసేందుకు డ్రిల్ యంత్రాలను బిగించేందుకు సిద్ధమయ్యారు. ఈ భూముల్లో పనులు చేయొద్దని రైతులు అడ్డుకున్నారు. జిల్లా టీఎస్ఐఐసీ డీఈ పవార్‌కు తెలియడంతో గ్రామానికి చేరుకొని రైతులను సముదాయించడానికి యత్నించారు. మట్టి పరీక్షలపై రైతులు కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డికి ఫోన్‌లో తెలుపగా.. ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఎలాంటి పరీక్షలు చేయకుండా పనులు నిలిపివేయాలని టీఎస్ఐఐసీ అధికారులను ఆదేశించడంతో వరు వెళ్లిపోయారు.



యంత్రాలు బిగిస్తున్న టీఎస్ఐఐసీ అధికారులు

దైవభక్తిని అలవర్చుకోవాలి

యాచారం, జూన్ 29 : ప్రతీ ఒక్కరు దైవభక్తిని అలవర్చుకుంటే సమాజంలో శాంతి నెలకొంటుందని హంపి విరూపాక్ష విద్యారణ్య భారతి అన్నారు. శనివారం తక్కళ్లపల్లి తండాలో బంగారుమైసమ్మ ఆలయంలో ఎవరెస్టు శిఖరం అధిరోహించిన అంగోత్ తుకారాం-మానస దంపతులు మూడు రోజులు నిర్వహించిన హోమం, పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నిత్యం అరగంట భగవంతుడిని సేవిస్తే మన శ్శాంతి ఉంటుందన్నారు. చిన్న వయసులో ఎవరెస్టు శిఖరం అధిరోహించి దేశఖ్యాతిని చాటిన తుకారాం అభినందనీయుడని దీవించారు.

'రైతుబంధు' వెంటనే ఇవ్వాలి

తలకొండపల్లి, జూన్ 29: వానకాలం సాగు మొదలై నెలరోజులవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోందిని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రకటించినట్టు ఎకరానికి రూ.15వేల రైతుభరోసా ఇవ్వాలన్నారు. వెల్జాలలో శనివారం విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పెట్టుబడి డబ్బుల్లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అందజేయాలని ఆయన కోరారు.

ఎట్టకేలకు బ్రిడ్జి అప్రోచర్స్ పనులు షురూ



సాగర్ రహదారిపై శేరిగూడ వద్ద మొదలైన బ్రిడ్జి అప్రోచర్స్ పనులు

ఇబ్రహీంపట్నం, జూన్ 29 : నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారి శేరిగూడ-మంగల్‌పల్లి మధ్య స్లైనర్ బ్రిడ్జి అప్రోచర్స్ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. 2022సెప్టెంబరులో వచ్చిన వరదలకు ఇబ్రహీంపట్నం చెరువు అలుగు పారడంతో వరదకు శేరిగూడ శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాల వద్ద రహదారిపై బ్రిడ్జి కూలిపోయింది. బీఆర్ఎస్ రెండేళ్ల క్రితం రూ.3.5కోట్లతో ఇక్కడ బ్రిడ్జి పనులు చేపట్టారు. రహదారికి ఒక వైపే బ్రిడ్జి పనులు పూర్తిచేసి బిల్లులు రాక కాంట్రాక్టరు అప్రోచర్స్ పనులు చేయలేదు. దాంతో రహదారికి ఒక వైపునే రాకపోకలు కొనసాగుతుండడంతో రహదారిపై గుంతలుపడి ప్రమాదకరంగా మా రింది. వరదొస్తే రాకపోకలు నిలిచే అవకాశముంది. ఈ సమస్యపై 'ప్రమాదకరంగా ప్రయాణం' శీర్షికన మార్చి 14న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఎమ్మెల్యే మల్‌రెడ్డి చొరవ తీసుకుని పనులు పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలివ్వడంతో పనులు మొదలయ్యాయి.

పనులు త్వరగా పూర్తి చేస్తాం

బిల్లులు విడుదల కాకే బ్రిడ్జి పనులు నిలిచిపోయాయి. ఇప్పుడు పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి అప్రోచెస్ పనులు మొదలుపెట్టాం. త్వరితగతిన పనులు పూర్తిచేసి బ్రిడ్జిపై నుంచి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేస్తాం. ఆ తర్వాత రెండో వైపు బ్రిడ్జి నిర్మాణం పనులు చేపడతాం.

- టి.సీతారామయ్య, డీఈ, ఆర్‌అండ్‌బీ

లోకాయుక్త ఆదేశాలతో తహసీల్దార్‌పై కేసు

శంకర్‌పల్లి, జూన్ 29: గతంలో శంకర్‌పల్లి తహసీల్దార్‌గా పనిచేసిన మోహన్‌రావుపై కేసు నమోదైంది. లోకాయుక్త ఆదేశాల మేరకు శనివారం శంకర్‌పల్లి పోలీసులు తహసీల్దార్‌తో పాటు అప్పటి దొంతాన్‌పల్లి వీఆర్‌వో, జంగంపేట మాణికొరెడ్డిలపై కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బాలాపూర్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన కడారి అంజయ్య.. 2021లో శంకర్‌పల్లి మండలం పిల్లిగుండ్లకి చెందిన దర్ని శ్రీకాంత్, దర్ని రాములమ్మల వద్ద దొంతాన్‌పల్లిలో సర్వే నంబర్ 151లో 0.22గుంటల భూమి జీపీఏ చేసుకున్నాడు. 2005-06లో తహసీల్దార్‌గా పనిచేసిన మోహన్‌రావు, దొంతాన్‌పల్లి వీఆర్‌వో పిల్లిగుండ్లకు చెందిన జంగంపేట మాణికొరెడ్డి పేరిట అదే భూమిని 0.22గుంటల భూమిని 24 సెప్టెంబరు 2005న మ్యుటేషన్ చేశారు. అక్రమంగా మ్యుటేషన్‌పై కడారి అంజయ్య లోకాయక్తను ఆశ్రయించాడు. లోకాయుక్త ఆదేశాల మేరకు పోలీసులు తహసీల్దార్, వీఆర్‌వో, మాణికొరెడ్డిలపై 420, 465, 468, 471 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీనిపై శంకర్‌పల్లి సీఐహబీబుల్లాఖాన్‌ను వివరణ కోరగా.. అప్పటి తహసీల్దార్, వీఆర్‌వో, మాణికొరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరికపై నిరసనలు



నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల, జూన్ 29: చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరడంతో నియోజకవర్గంలో ఆయనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. శనివారం ఎమ్మెల్యే దిష్టిబొమ్మలు దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ.. పదేళ్లు బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించిన యాదయ్య వ్యక్తిగత పనుల కోసమే కాంగ్రెస్‌లో చేరారని వేజ్ బోర్డు మాజీ చైర్మన్ నారాయణ, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి చటర్జీ దశరథ్ అన్నారు. హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై యాదయ్య దిష్టిబొమ్మను దహనం చేశారు. యాదయ్యకు కేసీఆర్ రెండుసార్లు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారన్నారు. భవిష్యత్తులో యాదయ్యకు రాజకీయంగా పట్టగతులుండవన్నారు. యాదయ్య కుటుంబానికి జడ్పీటీసీ, ఎంపీపీ పదవులను సైతం బీఆర్ఎస్ ఇచ్చిందని, యాదయ్య పార్టీ ఎందుకు మారుతున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన లేకున్నా పార్టీకి నష్టం లేదన్నారు. కార్యకర్తలకు, ప్రజాప్రతినిధులకు కేసీఆర్, కేటీఆర్‌లు అండగా ఉంటారన్నారు. త్వరలోనే కేటీఆర్‌తో చేవెళ్లలో సభ ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఎంపీటీసీ విజయ్‌కుమార్, లక్ష్మీనర్సింహారెడ్డి, అఫ్సర్ ఖాన్, ఎజాజ్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చేవెళ్ల, జూన్ 29: బైక్‌పై వేగంగా వెళ్తూ యూటర్న్ చేస్తున్న మరో బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. శనివారం ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పామెనకు చెందిన బర్కని కృష్ణ, అదే గ్రామానికి చెందిన మంచన్‌పల్లి బాలయ్య(65) కలిసి ఈ నెల 28న మధ్యాహ్నం చేవెళ్ల నుంచి గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో చేవెళ్లలోని షాబాద్ చౌరస్తాలో వారు బైక్‌ను యూటర్న్ తీసుకుంటున్నారు. ఇంతలో షాబాద్ నుంచి బైక్‌పై వేగంగా వచ్చిన వ్యక్తి వీరి బైక్‌ను ఢీకొన్నాడు. కృష్ణకు తలకు, బాలయ్యకు కాలికి గాయలయ్యాయి. వారిని నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలయ్య అదే రోజు రాత్రి మృతిచెందాడు. అతడి కుటుంబీకుల ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతుకు తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న శివ

కేశంపేట, జూన్ 29: పొలంలో ఓ వ్యక్తి ట్రాన్స్‌ఫార్మర్ సరిచేస్తుండగా విద్యుదాఘాతంతో ఓ రైతు గాయపడ్డాడు. ఈ సంఘటన శనివారం బొదునంపల్లిలో చోటు చేసుకుంది. క్యామ శివ(24) తన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ రెండు రోజులుగా సరిగ్గా పనిచేయడం లేదని లైన్‌మన్ జంగయ్యకు ఫోన్ చేసి చెప్పాడు. లైన్‌మన్ మరమ్మతులు చేస్తామని తెలిపాడు. అయితే చౌలపల్లి ఫీడర్ పరిధిలో సాయంత్రం వరకు చెట్లు కొడుతున్నామని, విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని లైన్మన్ చెప్పడంతో శివ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు ఉపక్రమించాడు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా అయ్యి శివ గాయపడ్డాడని రైతులు తెలిపారు. అతడిని షాద్‌నగర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించామని గ్రామస్తులు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే రైతు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని వాపోయారు. ఈ కరెంట్ షాక్ ఘటనపై ఏఈ ఈశ్వర్‌ను వివరణ కోరగా బొదునంపల్లి లైన్‌లో ఎవరికీ ఎల్‌సీ ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు.

కరెంట్ షాక్‌తో ఆవు మృత్యువాత



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆవు కళేబరం

కొందుర్గు, జూన్, 29: కరెంట్‌షాక్ కొట్టి ఆవు మృతిచెందిన ఘటన శనివారం చెక్కలోనిగూడెంలో జరిగింది. నల్లమోని ఆంజనేయులుకు చెందిన ఆవు మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగా కరెంట్ సాక్ కొట్టి చనిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ గద్దె కిందకి ఉండడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, మంగళవారమే సర్ధార్‌నగర్ అంగడిలో రూ.96వేలకు ఆవును కొన్నానని రైతు రోదించాడు. తనకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని అంజనేయులు కోరాడు.

ఊట్‌పల్లిలో 618 గ్రాముల హెరాయిన్ స్వాధీనం

శంషాబాద్ రూరల్, జూన్ 29: శంషాబాద్ పరిధి ఊట్‌పల్లిలో హెరాయిన్‌ను శనివారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఊట్‌పల్లిలో అంబాలాల్ సుతార్ కొన్ని రోజులుగా తన నివాసంలో మత్తుపదార్థాలు(హెరాయిన్) నిల్వ చేశాడనే సమాచారం మేరకు ఎస్సై రాజ్‌కుమార్ సిబ్బందితో దాడులు చేసి 618గ్రాముల హెరాయిన్‌ను పట్టుకున్నారు. ఈ డ్రగ్ విలువ రూ.74లక్షలుంటుందని పోలీసులు తెలిపారు. నిందితుడు డ్రగ్స్‌ను ఎక్కడి నుంచి తెచ్చాడు? ఎవరికి సరఫరా చేస్తున్నాడు? తదితర కోణాల్లో చేస్తున్నామని, అంబాలాల్‌ను అదుపులోకి తీసుకొని, డ్రగ్స్‌ను సీజ్ చేశామని సీఐ తెలిపారు. ఊట్‌పల్లిలో డ్రగ్స్ పట్టుబడడం కలకలం రేపింది. నివాసాల మధ్య పట్టుబడడం మొదటి సారని స్థానికులు అన్నారు. పోలీసులు నిఘూపెట్టి డ్రగ్స్ అమ్మేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

'సౌత్ గ్లాస్'లో ఘటనకు యాజమాన్యమే బాధ్యత వహించాలి

షాద్‌నగర్ రూరల్, జూన్ 29: ఫరూఖ్‌నగర్ మండలం బూర్గు శివారులోని సౌత్ గ్లాస్ పరిశ్రమలో జరిగిన పేలుడుకు ఫ్యాక్టరీ యాజమాన్యమే బాధ్యత వహించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. రియాక్టర్ పేలి ఐదుగురు కార్మికులు చనిపోగా పది మంది తీవ్రంగా గాయపడడంతో శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశ్రమను సందర్శించారు. యాజమాన్యంపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబాలకు రూ.50లక్షల చొప్పున, శాశ్వత వైకల్యం పొందిన వారికి 25లక్షలు, క్షతగాత్రులకు పది లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతులు, క్షతగాత్రులకు అంతర్రాష్ట్ర కార్మిక చట్టాలను వర్తింపజేయాలని అన్నారు. పరిశ్రమ ప్రారంభించే వరకు కార్మికులకు పూర్తివేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, కార్యదర్శి చంద్రమోహన్,నాయకులు శ్రీనునాయక్, సాయిబాబ, కవిత, ఈశ్వర్ ఉన్నారు. అలాగే ఏఐటీయూసీ నాయకులు పరిశ్రమను సందర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.40లక్షలు, క్షతగాత్రులకు రూ.10లక్షల చొప్పున ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామస్వామి డిమాండ్ చేశారు. నాయకులు శ్రీను నాయక్, దత్తుకుమార్ తదితరులు ఉన్నారు.

ఫ్యాక్టరీ ప్రమాదంలో మృతులెందరో చెప్పండి : బక్కని



షాద్‌నగర్ అర్బన్, జూన్ 29: రాష్ట్రంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికుల సంఖ్య తేల్చాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌కు శనివారం లేఖ రాశారు. బూర్గుల శివారులోని సౌత్ గ్లాస్ అద్దాల తయారీ పరిశ్రమలో పేలుడులో ఐదుగురు మరణించగా, పదుల సంఖ్యలో కార్మికులు గాయపడ్డారన్నారు. ఈ ఘటనలో ఐదుగురు మరణించారని యాజమాన్యం చెబుతున్నా.. మరింత మంది మరణించారని కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వద్ద కార్మికుల కచ్చితమైన లెక్కలు లేవని, యాజమాన్యం స్కిల్డ్ వర్కర్లను రియాక్టర్ల వద్ద ఏర్పాటు చేసుకోకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఇతర రాష్ట్రాల కార్మికుల లెక్కలు కచ్చితంగా ఉండాలని, పరిశ్రమల్లో పని చేస్తున్న వారి రికార్డులను పొందుపర్చాలని కోరారు. ఈ ఘటనతోనైనా యంత్రాగం స్పందించి, పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలని నర్సింహులు డిమాండ్ చేశారు.

సంక్షిప్తంగా...

● **కడ్తాల్:** మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నేత డి.శ్రీనివాస్ మృతిపట్ల కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు. కడ్తాలలో శనివారం ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఆధ్వర్యంలో డీఎస్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన కాంగ్రెస్ పార్టీకి, తెలుగు రాష్ట్రాలకు అందించిన సేవలు చిరస్మరణీయమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నేనావత్ బీక్యనాయక్, నర్సింహ అన్నారు. కార్యకర్త స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన శ్రీనివాస్ రాజకీయ ప్రస్థానం యువతకు, రాజకీయ నాయకులకు ఆదర్శ ప్రాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు జహంగీర్‌బాబా, వెంకటేశ్, హీరాసింగ్, లక్ష్మయ్య, బ్రహ్మచారి, మల్లయ్య, జహంగీర్ అలీ, రాంచందర్‌నాయక్, కృష్ణ, మంకీ శ్రీను ఉన్నారు. ఆమనగల్లులో డీఎస్ సంతాప కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు మండ్లి రాములు, కాలె మల్లయ్య, గండికోట మల్లేశ్, యాదయ్య, పి.మానయ్య, ఆంజనేయులు, కొప్పు రాఘవేందర్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

● **యాచారం:** ప్రతీ పాఠశాలకు మిషన్‌భగీరథ కింద తాగునీటిని అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎంపీపీ సుకన్య ఆదేశించారు. విద్యార్థులు నీటి కోసం ఇబ్బంది పడకుండా చొరవ తీసుకోవాలన్నారు. మండల సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షలో ఎంపీపీ మాట్లాడారు. వానాకాలంలో వైరల్ ఫీవర్‌తో జనం బాధపడకుండా మురుగు కాలువలను శుభ్రం చేయించాలని అన్నారు. దోమలు, ఈగల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వాడలో, రోడ్లవెంట వర్షాలు కురవగానే నాటాలన్నారు. ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రజిత, మిషన్ భగీరథ ఏఈ అనిరుద్ పాల్గొన్నారు.

● **షాద్‌నగర్ అర్బన్:** షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు పులిమామిడి శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. కార్యక్రమానికి హాజరైన భక్తులు పాటలు పాడుతూ, భజనలు చేస్తూ పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన దాత పలబట్ల పాండురంగం దంపతులను ఘనంగా సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

● **కడ్తాల్:** రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న కొండ్రిగానుబోనుతండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు నేజ్యానాయక్‌ను ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి పరామార్శించారు. ఆయన ఆరోగ్యంపై తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో నర్సింహ, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, జహంగీర్‌బాబ, లక్ష్మయ్య, వెంకటేష్, లక్ష్మయ్య, సేవ్యానాయక్, రాంచందర్‌నాయక్, బాలరాజు, కృష్ణ తదితరులు ఉన్నారు.

● **మంచాల:** రైతుల అభ్యున్నతికి కృషిచేస్తామని మంచాల ప్యాక్స్ చైర్మన్ వి.హన్మంతరెడ్డి అన్నారు. సొసైటీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సంఘ పరిధిలో రైతులకు రూ.18కోట్ల దీర్ఘకాలిక రుణాలు ఇచ్చామన్నారు. రుణాలకు రూ.9కోట్ల వడ్డీ కాగా మరో రూ.10కోట్ల అపరాధ వడ్డీ చెల్లించాల్సి ఉందన్నారు. రైతులు రుణాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రైతు రుణమాఫీ అమల్లోకి వస్తుందని చెప్పారు. సహకార సంఘంలో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిపాజిట్లపై అధికవడ్డీ, బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీకి రుణాలిస్తామన్నారు. సమావేశంలో ప్యాక్స్ డైరెక్టర్లు వెంకటేష్‌యాదవ్, పి.రమేష్, ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి ఉన్నారు.